# 20. అంతా ఒక్కటే

ఉగాదికి ఓ పండితుడ్ని తమ ఇంటికి భోజనానికి పిలిచాడు ఓ కుటుంబ పెద్ద. ఆ రోజు ఆ కుటుంబ సభ్యులంతా తల స్నానాలు చేసి గుళ్ళకి వెళ్ళారు.

మొదట వెంకటేశ్వర స్వామి ఆలయం. తర్వాత శివాలయం అటు తర్వాత రాజరాజేశ్వరి గుడి, పిమ్మట ఆంజనేయస్వామి, షిరిడి సాయిబాబా గుళ్ళకి వెళ్ళారు. చివరగా గ్రామదేవత ఆలయానికి వెళ్ళి ఇంటికొచ్చారు.

దాంతో ఇంటావిడ వంట చేయడం ఆలస్యమైంది.

భోజనానికి వచ్చిన పండితుడు వంట అవడానికి ఆలస్యమౌతుందని తెలుసుకుని కారణం అడిగాడు.

"మేం గుళ్ళకి వెళ్ళడంతో ఆలస్యమైంది. పండుగ కదా! ప్రతీచోటా పెద్ద పెద్ద క్యూలు. దాంతో అర్చనలకి లేటైంది." కుటుంబ పెద్ద తాము వెళ్ళిన గుళ్ళ జాబితా అంతా వివరించాడు.

వంటయ్యాక పండితుడికి కట్టుకోడానికి పంచె ఇచ్చాడాయన.

"ఇదేమిటి? ఉత్తరీయమా ఇది?" ప్రశ్నించాడు పండితుడు.

"కాదండి. పంచె." చెప్పాడు కుటుంబ పెద్ద.

పండితుడు ఆ వస్త్రాన్ని భుజాన వేసుకుని అడిగాడు.

"మరి ఇప్పుడు దీన్నేమంటారు?"

"ఉత్తరీయమే అంటారు." చెప్పి అతను ఇంకో పంచె తెచ్చిచ్చాడు.

"ఇదేమిటి? తలపాగా ఇచ్చావు?" అడిగాడు పండితుడు.

"ఇది పంచె." చెప్పాడు యజమాని.

"మరి దీన్నేమంటారు?" అడిగాడు పండితుడు దాన్ని తలకి చుట్టి.

"తలపాగానే." ఒప్పుకుని ఇంకో పంచె తెచ్చిచ్చాడు ఇంటాయన.

"ఇది పంచే." అని పండితుడు దాన్ని మొలకి కట్టుకున్నాడు.

"స్వామీ! మీరేం బోధించదలచుకున్నారో నాకు అర్థం కాలేదు?" సందేహంగా అడిగాడు కుటుంబ పెద్ద.

"ఒకే వస్త్రం. దాన్ని తలకి చుడితే తలపాగా అంటాం. మొలకి చుడితే పంచె అంటాం. భుజాన వేసుకుంటే ఉత్తరీయం. అలాగే ఉన్నది ఒకే దైవం. దానికి విలాసవంతమైన భోగరూపం వేస్తే అమ్మవారంటాం. పురుష రూపం వేస్తే వెంకటేశ్వర స్వామి అంటాం. క్రోధరూప అలంకరణని కాళిక అంటాం. శాంత రూపాన్ని వేస్తే లలిత అంటాం. మనకి నచ్చిన ఏ ఒక్క రూపాన్నో మనసులో పెట్టుకుని కొలిస్తే చాలు." వివరించాడాయన.

కుటుంబ పెద్దకి విషయం అర్థమైంది.

## 21. కమ్మరి - వీరుడు

చిన్నప్పటినించీ రామకృష్ణకి ఆధ్యాత్మిక జిజ్ఞాస అధికం. అతను అందుకు సంబంధించిన అనేక గ్రంథాలు చదివాడు. చాలా విషయాల్లో అతను విరాగి. ఓసారి పుస్తకాల షాపుకి వెళ్తే, సేల్స్‌మేన్ ఓ పుస్తకం అతని చేతిలో పెట్టి చెప్పాడు.

"ఓ కొత్త పుస్తకం వచ్చింది. చాలా బావుందంటున్నారంతా."

'స్వామి ప్రణవానంద' రాసిన ఆ పుస్తకంపై అంతకుముందే సమీక్ష చదివి వుండటంతో రామకృష్ణ దాన్ని కొని చదివాడు. అది చదివిన ప్రతీవారికి దైవం మీద మనసు లగ్నమై, లౌకిక విషయాలపై వైరాగ్యభావం ఏర్పడేంత పటిష్టంగా సాగిందా రచన. ఆద్యంతం ఏకబిగిన చదివాక రామకృష్ణ 'ఆయన ఎంత మహాజ్ఞానో కదా? అలాంటివారి దర్శనం పుణ్యప్రదం' అనుకుని ఆ గ్రంథ రచయితని కలుసుకోవాలనుకున్నాడు.

ఆయన చిరునామా పబ్లిషర్ ద్వారా సంపాదించి ఓ రాత్రి పగలు రైల్లో ప్రయాణించి, ఆయన వుండే ఊరు చేరుకున్నాడు. ఆయన గృహస్థు అని తెలిసి విస్మయంగా అడిగాడు.